క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాద్, డాక్టరు కుమార్ యాదవ్, శ్రీనగేష్, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడ



స్వచ్ఛ పక్వాడలో పాల్గొన్న ఆర్‌ఎం నరసింహమూర్తి

బాలాజీచెరువు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ కాకినాడ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ పక్వాడ నిర్వహించారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జే.నరసింహామూర్తి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. స్వచ్ఛభారత్ భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో సముద్రతీర ప్రాంతం వంటి పలు చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని, స్మార్ట్‌సిటీలో భాగంగా నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆర్.సాయిరామ్ ప్రసాద్, ఆర్‌బీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



కాకినాడ సిటీ: ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పసుపులేటి శ్రీనివాస్‌ను మూడోసారి ఏకగ్రీవంగా రాష్ట్ర అసోసియేషన్ ఎన్నుకుంది. బుధవారం అమరావతిలో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రెండు సార్లు ఎంపికైన శ్రీనివాస్‌ను మూడోసారి కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ గ్రేడ్–1 అధికారిగా పని చేస్తున్నారు.

లంపీ స్కిన్ సోకకుండా ఆవులకు టీకాలు



లంపీ వ్యాధి నివారణకు ఆవులకు ఇంజక్షన్లు వేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

కాకినాడ సిటీ: లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా నగరంలోని ఆవులకు కాకినాడ నగరపాల సంస్థ ఆధ్వర్యంలో టీకాల వేసే కార్యక్రమాన్ని బుధవారం అధికారులు చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్ పశుసంవర్ధకశాఖ, స్నాప్ విభాగాల సహకారంతో 22, 23, 24 డివిజన్లలోని ఆవులకు లంపీ స్కిన్ డిసీజ్ బారిన పడకుండా ఉండేందుకు టీకాలు వేశారు. ఈ వ్యాధి నుంచి మరిన్ని మూగజీవాలను కాపాడేందుకు వాటి యజమానులు, వ్యాక్సినేషన్ ప్రక్రియ త్వరితగతిన జరిగేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. చర్చిస్క్వేర్ సెంటర్, ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రాంతంలో జరిగిన టీకా పంపిణీ కార్యక్రమాన్ని నగరం మొత్తం విస్తరించేందుకు సహకరించాలని అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలను కోరారు. ఆవుల్లో లంపీ స్కిన్ డీసీజ్ లక్షణాలు కనిపించిన వెంటనే 1962 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

20న 114.82 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం

కరప: మండలంలోని వేళంగి గ్రామంలో మండల స్థాయి గోడౌన్‌లో జప్తు ద్వారా తరలించి ఉంచిన పీడీఎస్ బియ్యం 114.82 క్వింటాళ్లను వేలం ద్వారా విక్రయించి ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని కరప తహసీల్దార్ పి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ వేలాన్ని ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు అనుసరించి వేలం జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆ సరకు తనిఖీ చేసుకుని సీల్డ్ కవర్‌లో వారు ఖరీదు చేసే రేటును పేర్కొని కరప డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లయీస్‌కు వేలం జరిగే గోడౌన్ వద్ద దాఖలు చేయవలసిందిగా తహసీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



- పేదింటి ఆడపిల్లలకు అండగా జగనన్న
- కల్యాణమస్తు పథకంతో ఆర్థిక భరోసా
- దరఖాస్తు చేసుకుంటే సాయం

కాకినాడ రూరల్: ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అంటారు పెద్దలు.. అంటే ఇల్లు కట్టడమైనా, పెళ్లి చేయడమైనా ఖర్చుతో కూడుకున్న పనని దాని అర్థం. ముఖ్యంగా పల్లెల్లో ఆడ పిల్లల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులకు కనుకు పట్టదు. కట్న కానుకల మాట పక్కన పెడితే.. వియ్యాల వారు, బంధువులు, గ్రామంలోని ఇరుగు పొరుగు వారికి కడుపు నిండా విందు భోజనం పెట్టాలని చూస్తారు. పేదింట పెళ్లి అయితే అమ్మాయి తరపు వారికి పెళ్లి పెద్ద పరీక్షే. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆడపిల్లల పెళ్లిళ్లకు ఒక అన్నగా ముఖ్యమంత్రి జగనన్న అండగా నిలుస్తున్నారు. పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహకారం అందించేందుకు వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను గత ఏడాది అక్టోబర్ లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆదివారం నుంచి మాఘ మాసం వస్తుండడంతో పెళ్లి భాజాలు మోగనున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన అర్హతలను కాకినాడ డీఎల్‌డీఓ పాతంశెట్టి నారాయణమూర్తి వెల్లడించారు.

వైఎస్సార్ కల్యాణ మస్తు/ వైఎస్సార్ తోఫా పథకాలకు అర్హతలు

- పెండ్లి కుమార్తెకు 18, పెండ్లి కుమారుడికి 21 సంవత్సరాలు నిండాలి. వయసు వివాహ తేదీ నాటికి పూర్తయి ఉండాలి.
- పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇరు కుటుంబాలు బీపీఎల్ కేటగిరీకి చెందిన వారై ఉండాలి.
- 01.10.2022 తేదీ నుంచి జరిగిన వివాహాలను పరిగణలోకి తీసుకోవాలి.

ఆర్థిక సహాయం వివరాలు

- పెండ్లి కుమార్తెను ప్రతిపాదికగా తీసుకుని ఈ పథకంలో సహాయం అందజేస్తారు.
- పెండ్లి కుమార్తె ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెంది, అదే కేటగిరికి చెందిన పెండ్లి కుమారుడిని వివాహం చేసుకుంటే రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తారు.
- అదేవిధంగా పెండ్లి కుమార్తె ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెంది, పెండ్లి కుమారుడు మిగతా ఇతర కేటగిరీకి చెంది ఉంటే ఎస్సీ ఇంటర్ కేస్ట్ వివాహంగా పరిగణించి రూ.1.20 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తారు.
- పెండ్లి కుమార్తె బీసీ కేటగిరీకి చెంది, అదే కేటగిరీకి చెందిన చెందిన పెండ్లి కుమారుడిని పెళ్లి చేసుకుంటే రూ.50వేలు అందజేస్తారు.
- పెండ్లి కుమార్తె బీసీ కేటగిరీకి చెంది, పెండ్లి కుమారుడు ఇతర కేటగిరీకి చెంది ఉంటే ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్‌గా పరిగణించి రూ.75వేలు ఆర్థిక సహాయం అందజేస్తారు.
- అలాగే మైనార్టీలకు సంబంధించిన పెండ్లి కుమార్తె అదే కేటగిరీకి చెందిన పెండ్లి కుమారుడిని వివాహం చేసుకుంటే రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తారు.
- భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికుల కుటుంబానికి చెందిన పెండ్లి కుమార్తె వివాహానికి రూ.40వేలు అందజేస్తారు. పెండ్లి కుమార్తె తల్లిదండ్రులు సంబంధిత వెల్ఫేర్ బోర్డులో రిజిస్టరై ఉండాలి.
- దివ్యాంగులకు సంబంధించి పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల్లో ఇరువురు వికలాంగులైనా లేదా ఒకరు వికలాంగులైనా రూ.1.50 లక్షల సాయం అందిస్తారు.

వివాహమైన 60 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి



వివాహ తేదీ నుంచి 60 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. మాఘ మాసంలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అర్హులైన కుటుంబాలు దరఖాస్తు చేసుకునేలా గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందితో రానున్న వారం రోజుల్లో పూర్తిగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– పాతంశెట్టి నారాయణమూర్తి, డివిజనల్ అభివృద్ధి అధికారి, కాకినాడ

భావనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.1.90 లక్షలు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో వేంచేసిన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో హుండీలను బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు లెక్కించారు. గత ఏడాది నవంబరు 28 నుంచి బుధవారం వరకు హుండీల లెక్కింపు ద్వారా రూ.1,90,735 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. హుండీ లెక్కింపులో అధికారులతో పాటు అర్చకులు, పారాయణం భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

21న పురందర దాసు ఆరాధనోత్సవం

కాకినాడ కల్చరల్: శాస్త్రీయ కర్ణాటక సంగీతానికి ఇంతటి ఔన్నత్యం ఏర్పడడానికి పితామహుడైన పురందర దాసు ఆరాధనోత్సవాన్ని ఈనెల 21వ తేదీ సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి బుధవారం తెలిపారు. స్థానిక సర్పవరంలోని నారద కుండం వాగ్గేయకార మండపంలో శనివారం శ్రీలక్ష్మీమహావిష్ణు భజన మండలి(పెద్దాపురం) సభ్యులతో పురందర దాసు కీర్తనల గానం చేస్తారని ఆమె తెలిపారు. సంగీత , సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన పురందరదాసు ఆరాధనోత్సవానికి సంగీత విద్వాంసులు, వారి శిష్యులు, భక్తులు హాజరుకావాలని ఆమె కోరారు.

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక 8వ డివిజన్‌లోని సాంబమూర్తినగర్‌లోని 5వ వీధిలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పరిసర ప్రాంతాలకు చెందిన నీరంతా సాంబమూర్తినగర్ ఐదో వీధికి చేరడం వల్ల వర్షం వచ్చిన ప్రతి సారి ఈ ప్రాంతం ముంపునకు గురవుతోందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పళ్లంరాజునగర్, అయోధ్యనగర్ ప్రాంతాల్లో రెండు డైవర్షన్ డ్రైన్‌లు నిర్మిస్తున్నామన్నారు. ఇవి పూర్తయితే వచ్చే వర్షాకాలం నాటికి ముంపు సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి గల ప్రభుత్వం, ముఖ్యమంత్రి అందుబాటులో ఉన్నారన్నారు. అందువల్ల ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించగల మనే ధైర్యం ఉందన్నారు. ప్రస్తుతం సాధికార సర్వే జరుగుతుందని, వివాహమైన కుటుంబాలు విడిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, కర్రి శైలజ, చిట్నీడి నారాయణ మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బళ్ల సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

తమ్మవరంలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

- విజేతగా పెనుమర్తి, రన్నర్‌గా తమ్మవరం జట్లు
- విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ సర్పంచ్ సత్తిరాజు



విజేత జట్టుకు నగదు పురస్కారం, మెమెంటో అందజేస్తున్న మాజీ సర్పంచ్ గొల్లపల్లి సత్తిరాజు

కాకినాడ రూరల్: సంక్రాంతి సందర్భంగా తమ్మవరం గ్రామంలో తమ్మవరం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గొల్లపల్లి సత్యవతి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గ్రామంలోని యూత్‌లో పండగ వేళ క్రీడోత్సాహాన్ని నింపింది. గ్రామ మాజీ సర్పంచ్ గొల్లపల్లి సత్తిరాజు స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ టోర్నమెంట్‌లో కాకినాడ రూరల్‌తో పాటు పరిసర మండలాల జట్లు పాల్గొన్నాయి. బుధవారం సాయంత్రం తమ్మవరం, పెనుమర్తి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పెనుమర్తి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 99 పరుగులు చేయగా తమ్మవరం జట్టు 80 పరుగులు మాత్రమే చేసింది. పెనుమర్తి జట్టు 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా భరత్, బెస్ట్ బ్యాట్‌మెన్‌గా శ్రీకృష్ణ, బెస్ట్ బౌలర్‌గా చింటూ, మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా శ్రీకృష్ణ నిలిచారు. విజేత జట్టుకు రూ.14వేలు, రన్నర్ జట్టుకు రూ.7వేలు చొప్పున నగదు పురస్కారం, మెమెంటోలను మాజీ సర్పంచ్ గొల్లపల్లి సత్తిరాజు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాపారావు, వీరబాబు, భద్రం, తదితరులు నిలిచారు.

ఉగాది నాటికి వెయ్యి గృహ ప్రవేశాలు లక్ష్యం



కొమరిగిరి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

బోట్‌క్లబ్: ఉగాది నాటికి కొమరగిరి లేవుట్‌లో వెయ్యి ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు జరిగేలా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ అధికారులను ఆదేశించారు. నగరపాలకసంస్థ, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందిన అధికారులతో ఆయన బుధవారం కొమరగిరి లేఅవుట్‌ను సందర్శించారు. గృహ నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. రూ.3.60 లక్షలతో నిర్మాణం పూర్తయిన ఇంటిని కమిషనర్, అదనపు కమిషనర్ నాగనరసింహారావు పరిశీలించారు. లే అవుట్‌లో ఏర్పాటు చేసిన బ్రిక్ ఇండస్ట్రీని సందర్శించారు. మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలను అక్కడ ఉన్న అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొమరగిరి లే అవుట్‌లో ప్రస్తుతం నాలుగువేల ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి శ్లాబులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో కొమరగిరి లేఅవుట్ మినీ టౌన్‌షిప్‌గా అవతరించబోతుందన్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా కుటీర పరిశ్రమలు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు తెలియజేసి , లబ్ధిదారులందరూ వేగంగా ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. అదనపు కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం ఇళ్ల నిర్మాణాలకు అనువుగా ఉన్నందున ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు సభ్యులుగా ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేలు బ్యాంకు లింకేజీ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డిఈ గుప్తా, ఆయా విభాగాల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వరి చేలల్లో జింక్ లోపం గుర్తింపు



జింక్ లోపం ఉన్న వరి ఆకులు, దుబ్బులు

కరప: మండలంలోని వెదజల్లు, ముదురు ఊడ్పుల్లో అక్కడక్కడా జింక్ లోపం, సల్ఫైడ్ ప్రభావం కనిపిస్తోందని మండల వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని వివిధ ప్రాంతాల్లో వరి చేలను సందర్శించారు. ఈ సందర్భంగా జింక్, సల్ఫైడ్ లోపాలను గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరప మండలంలో 14,714 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతోందన్నారు. ఇప్పటి వరకు 583 ఎకరాల్లో ఊడ్పులు, 12,536 ఎకరాల్లో వెదజల్లు పూర్తయ్యిందన్నారు. 90 శాతం వరి సాగు పూర్తయ్యిందని పంట కాలువల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో మిగిలిన పది శాతం నాట్లు రెండు, మూడు రోజుల్లో పూర్తవుతాయన్నారు. వెదజల్లు, ముదురు ఊడ్పుల్లో అక్కడక్కడా జింక్ లోపం కనిపిస్తోందన్నారు. దీని నివారణకు మహాజింక్ 250 గ్రాములు లేదా చిలాయన్ 12 శాతం, జింక్ 500 గ్రాములను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. సల్ఫైడ్ నివారణకు నీరు తీసి చేను నెరలు వచ్చే వరకు భూమిని ఆరబెట్టడం లేదా మనుషులతో భూమిని తొక్కించడం చేయాలని వ్యవసాయాధికారి రాజేష్ వివరించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక భద్రతా చర్యలు

పిఠాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల తరచు ప్రమాదాలు సంభవిస్తున్న గొల్లప్రోలు మండలం జాతీయ రహదారి వన్నెపూడి, చెందుర్తి పోలవరం కాలువ గట్టు ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు క్రాసింగ్‌లు ఉన్న చోట వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా స్థలాల్లో హెచ్చరికల బోర్డులతో పాటు వేగ నిరోధక ఏర్పాట్లు చేయాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌కు ఆయన సూచించారు. ఈయన వెంట గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ–ఏ జనరల్ ఒకటి, ఎస్టీ మహిళ ఒకటి, ఎస్సీ జనరల్ ఒకటి వలంటీర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గురువారం సాయంత్రం ఐదు గంటలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ఆపద మిత్రలకు శిక్షణ

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్నారు. ఉత్సాహంగా ఉన్న వలంటీర్లు, ఆశావర్కర్లను ఆపద మిత్రలుగా ఎంపిక చేస్తున్నారు. కాకినాడ జిల్లా నుంచి 75 మంది, తూర్పు గోదావరి జిల్లా నుంచి 50 మందికి స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు శిక్షణ ఉంటుందని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. ఇప్పటి వరకు ఐదు బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేశామని, ఆరో బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు.

గణపతిశాస్త్రి ఇంట్లో భారీ చోరీకి యత్నం



క్లూస్ టీమ్‌కు వివరాలు వెల్లడిస్తున్న పతంజలి శాస్త్రి



సీసీ కెమెరాకు చిక్కిన దొంగలు

సామర్లకోట: స్థానిక ప్రముఖ సిద్ధాంతిగా పేరొందిన దివంగత చంద్రాభట్ల చింతామణి గణపతి శాస్త్రి ఇంట్లో దొంగలు భారీ చోరీకి ప్రయత్నం చేశారు. ఈ మేరకు ఇనుప రాడ్లతో గేటు తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఇంటి ఆవరణలో ఉన్న స్టోర్ రూమ్ తాళం పగుల కొడుతున్న సమయంలో ఇంటి సమీపంలో అలికిడికి దొంగలు పరారై ఉంటారని గణపతిశాస్త్రి సోదరుడు పతంజలిశాస్త్రి తెలిపారు. ఈ మేరకు ఇనుప రాడ్‌ను గేటు వద్ద వదిలి వెళ్లిపోయారని, ప్రధాన గేటు గోడ నుంచి లోనికి ప్రవేశించిన ఇద్దరు దొంగలు మంకీ క్యాప్‌లు ధరించి వేలిముద్రలు పడకుండా చేతికి గ్లౌజ్‌లు ధరించినట్టు సీసీ కెమెరాలో పోలీసులు గుర్తించారు. పతంజలి శాస్త్రి ఫిర్యాదు మేరకు పోలీసులు, వేలిముద్ర నిపుణులు గణపతిశాస్త్రి ఇంటి కి చేరుకొని విచారణ ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దమ్ము చేస్తూ కుప్పకూలి యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో పొలంలో దమ్ము చేస్తున్న యువకుడు బండారు లక్ష్మణ్(28) బుధవారం ఉదయం మృతి చెందాడు. ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. రబీ వరి సాగు కోసం క్రిషి ట్రాక్టర్‌తో తండ్రి కౌలు చేస్తున్న పొలంలో దమ్ము చేస్తుండగా ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందాడు. మృతుడు తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అనాథలయ్యాం.. ఆదుకోండి

- ఓ మత్స్యకార కుటుంబం ఆవేదన



ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న కారే చంద్రావతి, ఆమె పిల్లలు



చెన్నై సముద్రంలో బోటు నుంచి జారిపడి మృతి చెందిన కారే శేఖర్ (ఫైల్)

కాకినాడ సిటీ: కాకినాడ దుమ్ములపేటకు చెందిన మత్స్యకారుడు కారే శేఖర్(37) ఈనెల 9న చెన్నైలో బోటుపై నుంచి సముద్రంలో జారిపడి మరణించినట్టు అతడి భార్య కారే చంద్రావతి బుధవారం కాకినాడలో విలేకర్లకు తెలిపారు. తన భర్త శేఖర్ మృతితో తన కుటుంబం అనాథగా మారిందని, తన ఇద్దరు పిల్లలను పోషించుకోవడం కష్టంగా మారిందని వాపోయింది. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను కలసి కోరినట్టు తెలిపారు. తన భర్త శేఖర్ రెండు నెలల క్రితం జీవనోపాధి కోసం చెన్నై వేటకు వెళ్లాడని, అక్కడ బోటు నుంచి జారి సముద్రంలో పడి మరణించాడని వివరించింది. ఈనెల 11న చెన్నై ఎన్–4 ఫిషింగ్ హార్బర్ పోలీస్ స్టేషన్ పోలీసులు మృతదేహాన్ని గుర్తించి తమకు ఫోన్ చేసి చెప్పారని చంద్రావతి వివరించారు. పోలీసుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే తాము కుటుంబ సభ్యులు చెన్నై వెళ్లి మృతదేహాన్ని గుర్తించామన్నారు. అక్కడే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అప్పగించారన్నారు. చెన్నైలోనే మృతదేహానికి లాంఛనాలన్నీ పూర్తి చేసినట్టు భార్య చంద్రావతి వివరించారు. తన భర్త శేఖర్ మృతితో తాను, తన ఇద్దరు పిల్లలు అనాథలయ్యామని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తన కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని చంద్రావతి కోరారు. తన భర్త చెన్నై సముద్రంలో బోటు నుంచి జారిపడి మృతి చెందిన విషయం, చెన్నై పోలీసులు ఇచ్చిన ఎఫ్ఐఆర్, ఆసుపత్రిలో ఇచ్చిన మరణ ధ్రువీకరణ పత్రం కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారికి అందజేసినట్టు ఆమె తెలిపారు.

పేదల పెన్నిధి ఎన్టీ రామారావు

కరప: మాజీముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పేదల పెన్నిధి అని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కరపలోని ఆయన విగ్రహానికి ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిలో రెండు రూపాయల బియ్యం, పింఛన్, హౌసింగ్ లోన్లు వంటి పథకాలు అమలు చేశారన్నారు. గొర్రిపూడి, వేళంగి గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి, మాజీఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

కాకినాడ రూరల్: నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి సందర్భంగా సర్పవరం, పండూరు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి వీరవెంకట సత్యనారాయణ మూర్తి తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సర్పవరం జంక్షన్‌లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కాకినాడ సిటీ: ఎన్‌టీ రామారావు వర్ధంతిని స్థానిక జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నగర టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఎంఎస్ఎన్ చారిటీస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1976-77 పూర్వ విద్యార్థులు

కాకినాడ సిటీ: కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ పాఠశాల 1976–77 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సమ్మేళనానికి 120 మంది హాజరయ్యారు. 12 మంది మహిళలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఆనందోత్సాహాల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఒకరినొకరు పలకరించుకుంటూ ఆప్యాయతను పంచుకున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారు?, ఎలా ఉన్నారు?, ఏం చేస్తున్నారు, ఉద్యోగమా?, వ్యాపారమా? అంటూ పరిచయాలు చేసుకుని తమకు చదువు చెప్పిన గురువులైన వి హనుమంతరావు, ఎం.సూర్యప్రకాశరావు, పి.రవీంద్రనాథ్, కె.తాతబ్బాయి, ఎం.జనార్దనరావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆదం గోవింద్‌రాజులు, గుత్తుల రమణ, గరగ వీరభద్రరావు, నమ్మి రాజబాబు, శీరం నాగేంద్రకుమార్, ఖాజా మొహిద్దీన్, మంగపతిరావు, పెంకే రామకృష్ణప్రసాద్, రహీమ్ తుల్లా, అరుణకుమారి, టి లక్ష్మీపాపాయి, పి.రామలక్ష్మి, సూర్యప్రభ, సుశీల, అన్నంగి హారేంద్రబాయి పాల్గొన్నారు. తామంతా మల్లాడి సత్యలింగ నాయకర్ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు.